ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న ప్రజలు

'గడపగడపకు' నిరసనలు, నిలదీతలు

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం కొండాపురం పంచాయతీలో గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మజారా గ్రామం పలదొడ్డిలో అడుగుపెట్టగానే చేసిన అభివృద్ధి ఏమిలేదని గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ ప్రజలు నిరసనలు, నిలదీతలతో ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో క్షణాల్లో అక్కడినుండి వెనుదిరిగి వెళ్ళిపోగా ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమానికి చేదు అనుభవం ఎదురైంది. మండలంలోనే అతి చిన్న పల్లె పలదొడ్డిలో సిసి రోడ్లు, మురుగు కాల్వలు, వీధిదీపాలు, లేక అవస్థలుపడుతున్నామని, ప్రధానంగా నదితీరం వెంట బస్సుల సౌకర్యం 40 ఏళ్ళు వెనక్కి వెళ్లిందని, పిల్లలు బడికి వెళ్ళలేక, ఇటు ఇంటి దగ్గర ఉంచుకోలేక పాట్లు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఇసుక అక్రమ రవాణా వాహనాల అతి శబ్దాలతో రాత్రి నిద్రకు భంగం కలుగుతుందన్నారు. పగలూ ప్రమాద గంటికలే నని ఆందోళన చెందారు. అక్రమ రవాణాలో ఎమ్మెల్యే మేనమామ, అతడి కొడుకు జడ్పిటిసి ,అనుయాయులే జేబులు నింపుకొంటూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని, ఎమ్మెల్యే కూడా ఇక్కడి ఇసుక సహజ సంపదతో కోట్లు గడిస్తున్నారే తప్ప అభివద్ధిపైనా, ఇక్కడి కార్యకర్తల సమన్వయంపైనా, ఉద్యమాలపైనా నోరుమెదిపినట్లు లేదని మండిపాటు నిరసన తెలిపారు. ప్రజల సొమ్ముతోనే పేర్లు మార్చుకున్న సంక్షేమ పథకాల మాటున ఒరిగిందేమి లేదని ఇప్పటికైనా ప్రజాగ్రహాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో సమిష్టిచర్చలతో బస్సు సౌకర్యం, రోడ్లు, ఇలా అనేకం అభివృద్ధి చేపట్టాలని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

ప్రజా పోరాటాల్లో

ఆటో కార్మికులు భాగస్వాములు కండి

- ఐలు రాష్ట్ర నాయకులు వెంకటస్వామి సూచన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వార్డులో అనేక పోరాటాలు జరుగుతున్నాయని ఈ పోరాటంలో ఆటో కార్మికులు కూడా భాగస్వాములు కావాలని ఐలు రాష్ట్ర నాయకులు డి.వెంకటస్వామి, సిఐటియు న్యూసిటీ అధ్యక్షులు నరసింహ ఆటో కార్మికులకు సూచించారు. గురువారం కర్నూలు మున్సిపల్ పరిధిలోని సోమిశెట్టి నగర్ యుటిఎఫ్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల విస్తృత సమావేశం ఆటో యూనియన్ న్యూ సిటీ ఉపాధ్యక్షులు ఎస్.మాలిక్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. డి.వెంకట స్వామి, నరసింహ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులు ప్రజలకు అండగా ఉన్న సంఘం సిఐటియు అని స్థానిక సమస్యలు, వీధిలైట్లు ,మురుగు కాలువలు, రోడ్లు ఆటో డ్రైవర్లకు ప్రత్యేకమైన ఆటోనగర్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై నిరంతరం చేస్తున్న పోరాటాల్లో ఆటో కార్మికులు కూడా భాగస్వాములు కావాలని వారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులను ఆదుకోవడంలో విఫలం చెందాయన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యవసర సరుకుల ధరలు పెంచడమే కాక ఆటో కార్మికులకు భారంగా మారిన జీవో నెంబర్ 21 ద్వారా రూ. వేలాది జరిమానాలు కట్టవలసి వస్తుందని చెప్పారు.నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఈ చలానా పేరుతో ఆటోలకు ఫోటోలు తీసి ఫైన్‌లు వేసి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ,పీఎఫ్ ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని ,ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఈ చలానా విధానాన్ని రద్దు చేయాలని, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈనెల 16, 17 ,18 తేదీలలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు వర్క్‌షాప్‌ను నిర్వహించబోతున్నామని, 16న ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచి ఎస్‌టిబిసి కళాశాల వరకు భారీ ఆటోర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ర్యాలీలో ఆటో డ్రైవర్ల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బి టి ఆర్ నగర్ కి చెందిన ఆటో యూనియన్ సీనియర్ నాయకులు ఆటోడ్రైవర్ అయిన నారాయణ మృతికి ఆటో యూనియన్ న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ తన వంతుగా రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబానికి ఇచ్చారు. రాధాకృష్ణను అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర నాయకులు వెంకటస్వామి

19, 20వ వార్డుల ఆటో కమిటీల ఎన్నిక

కమిటీ అధ్యక్షులుగా యేసు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, రాజ్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా జయన్న ,సహాయ కార్యదర్శిగా సయ్యద్, శివ, కోశాధికారిగా సుందర్ రాజ్‌లను , ఐదు మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ న్యూ సిటీ అధ్యక్షులు ఎస్ హుస్సేన్ వలి, ఉపాధ్యక్షులు బిటిఆర్‌నగర్ మాలిక్ బాష ,వలి, మధు ,సునీల్ ,వెంకటేష్ ఇంకా 100 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు తిరిగి ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి 2 వ బెటాలియన్ లో దేహదారుఢ్య పరీక్షలు తిరిగి ప్రారంభమయ్యాయి. వర్షం కారణంగా రెండు రోజుల పాటు నిలిపి వేశారు. అనంతరం మళ్లీ యథాతరంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 600 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ దేహదారుఢ్య పరీక్షలను కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, ఎస్‌పి జి.కృష్ణ కాంత్, సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్ పర్యవేక్షిస్తున్నారు.

స్వీపర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

- ఆర్ఎంకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఆర్‌టిసి బస్టాండులో తొలగించిన 11మంది కాంట్రాక్టు స్వీపర్సును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్‌టిసి ఆర్ఎం టి.వెంకటరామంకు గురువారం సిఐటియు నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండులో కాంట్రాక్టు స్వీపర్సుగా 1985 నుంచి పనిచేస్తున్న కార్మికులను 2020 సంవత్సరంలో కరోనా సందర్భంగా 11 మందిని మరలా తీసుకుంటామని చెప్పి ఏకారణం లేకపోయినా తొలగించారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ బస్టాండు కాంట్రాక్టు స్వీపర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆర్ఎం. టేకు వెంకటరామంకు సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు నగరకార్యదర్శి సిహెచ్.సాయిబాబా చిన్న వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ, ఎస్.అజ్మత్ కాంట్రాక్ట్ స్వీపర్సు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు, నరసింహులు బృందం ఆర్‌టిసి ఆర్ఎంకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఆర్ఎం కు సమస్యను వివరించారు. 2020 సంవత్సరం నుండి తొలగించిన 11 మంది కాంటాక్ట్ స్వీపర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. చాలాసార్లు కలిసినా ప్రయోజనం లేదన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన ప్రోగ్రాంలో కూడా ఆర్టీసీ కాంటాక్ట్ స్వీపర్సును విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చామన్నారు. జగనన్నకు చెబుదాం సీఎం ఫేషి నుంచి కర్నూలు ఆర్ఎంను ఈనెల 7న కలువమనిసీఎం ఫేషి నుండి ఇచ్చినందుకు కలవడానికి వచ్చామని సిఐటియు నాయకులు ఆర్టీసీఆర్ఎంకు తెలిపారు. ఆర్టీసీ ఆర్ఎం మాట్లాడుతూ మా పై అధికారులు తొలగించిన కాంట్రాక్టు స్వీపర్సు 11 మందిని తీసుకోమంటే తీసుకుంటామని అన్నారు. కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్ట్ స్వీకర్స్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓటింగ్ యంత్రాల తరలింపు

- ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓటింగ్ యంత్రాలను పరిశీలన నిమిత్తం ఆయా కంపెనీలకు తరలించడం జరుగుతుందని ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య తెలిపారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవిఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్లను పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని గోడౌన్లలో ఉన్న ఈవిఎం యూనిట్లు 2018 సంవత్సరం కంటే ముందు సరఫరా చేసినవని తెలిపారు. ఈ ఈవిఎం యూనిట్లు బెల్ (BEL) కంపెనీవి పరిశీలన నిమిత్తం 2598 బాక్సుల్లోని 25,975 ఓటింగ్ యంత్రాలను, హైదరాబాద్, ఘజియాబాద్‌లో గల కంపెనీకి తరలిస్తామని చెప్పారు. ఈవిఎంలను స్కానింగ్ చేస్తామన్నారు. స్కానింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దేవనకొండ తహశీల్దార్ వెంకటేష్ నాయక్, చిప్పగిరి తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఈవిఎం గౌడోన్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జీ కలెక్టర్ మౌర్య

భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు

- భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 30 నాటికి పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతిలో నుంచి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్ అంటే భూ హక్కు పత్రాల్లో వచ్చే వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని వెరిపై చేసే వాటిలో ఎటువంటి తప్పిదాలూ లేకుండా ఈ శనివారం నాటికి పూర్తి చేయాలన్నారు. భూ హక్కు పత్రాలను జనరేట్ చేసి ప్రింటింగ్‌కు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. గతంలో భూమి లేని నిరుపేదలందరికీ అసైన్ చేసిన ప్రభుత్వ భూమిలో లబ్ధిదారుడు ఉన్నాడా, వారి వారసులు ఉన్నారా, లేదంటే వేరే ఎవరైనా ఉన్నారా, వారికి ఏ సంవత్సరంలో కేటాయించారు వంటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడారు. ఫేస్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరగా వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ రెడ్డి, రమణకాంత్ రెడ్డి, సర్వే అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌ఛార్జీ కలెక్టర్ మౌర్య

పర్యావరణహిత జీవన శైలి అవసరం

అంతర్జాతీయ గాలిదినోత్సవం సందర్భంగా ప్రదర్శన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

అంతర్జాతీయ నిర్మలమైన ఆకాశం కోసం స్వచ్ఛమైన గాలి దినోత్సవం' సందర్భంగా నగర పాలక సంస్థ , కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా, నగర పాలక కార్యాలయం దగ్గర నుండి ఎస్‌బిఐ కాలనీలోని న్యూ కౌన్సిల్‌హాల్ వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భార్గవ్‌తేజ ప్రజలందరి చేత ' పర్యావరణహిత జీవన శైలికై' ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత మానవ జాతి ఎదుర్కొం టున్న అతి పెద్ద సమస్య గ్లోబల్ వార్మింగ్ అని, అందరూ వ్యక్తిగతంగా జాగృతులై, పర్యా వరణహిత జీవన శైలి అలవర్చుకోవటం ఒక్కటే పరిష్కారమని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ , ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషసాయి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి , శానిటేషన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ , సిబ్బంది

సంక్లిష్ట శస్త్రచికిత్సతో వృద్ధురాలికి పునర్జన్మ

-యశోద హాస్పిటల్‌లో అధునాతన వైద్య చికిత్సలు

-కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి డాక్టర్ గురుప్రకాష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

యశోద హాస్పిటల్‌లో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయడానికి అనువైన ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారానే ఒక వృద్ధురాలకి గుండెలో ఏర్పడిన అడ్డంకిని తొలగించామని హైదరాబాదులోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో సీనియర్ కార్డియాలజిస్టు, కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి డాక్టర్ గురు ప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక సూరజ్‌గ్రాండ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ పట్టణం అమ్మిరెడ్డి నగర్‌కి చెందిన సుబ్బలక్ష్మమ్మ అనే వృద్ధురాలు తీవ్రమైన ఛాతీ నొప్పితో బాధపడుతూ కర్నూలులోనే రెండుసార్లు యాంజియోప్లాస్టీ చేయించుకున్నా నయం కాకపోవడంతో వైద్యుల సలహా మేరకు సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించి గుండె ఆరోగ్యానికి కీలక రక్తనాళం అయిన ఎడమ సర్కమ్‌ప్లెక్స్ ధమనిలో అడ్డంకి ఉన్నట్లు గుర్తించాం. ఈ అడ్డంకి కఠినమైన కాల్షియంతో ఏర్పడినట్లు గుర్తించాం. దీనిని గైడ్‌లైనర్ మైక్రో కాథెటర్, గ్రాండ్‌స్లామ్ గైడ్ వైర్‌తో పాటు ఆధునిక ఇంటర్వెన్షనల్ టూల్స్‌ను ఉపయోగించి శస్త్ర చికిత్స చేసి తొలగించాం. ఇలాంటి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయడానికి యశోద ఆస్పత్రిలో అధునాతన క్యాథ ల్యాబ్, అధునాతన ఇమేజింగ్ టెక్నాలజిలైన ఎఫ్ఎఫ్ఆర్, ఐవియుఎస్, ఓసిటి , అధునాతన ఐసియు, ఎక్మో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సుబ్బ లక్ష్మమ్మ మాట్లాడుతూ తనకు డాక్టర్ గురుప్రకాష్ పునర్జన్మ ఇచ్చారని కొనియాడారు.

కృష్ణాష్టమి వేడుకల్లో టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఇస్కాన్ టెంపుల్, గోశాలలో కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఆయన అన్నారు. ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు శ్రీలప్రభుపాదుల వారికి పుష్పాంజలి సమర్పించారు. జగన్నాథబలదేవ సుభద్రామాయిలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నగర శివారులోని గాయత్రీ గోశాలను సందర్శించి కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి ఉట్టి కొట్టారు. గోమాతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు, గాయత్రీ గోసేవ సమితి గౌరవ అధ్యక్షులు విజయ్ కుమార్, అధ్యక్షులు జగదీష్ గుప్త, ఇల్లూరు లక్ష్మయ్య, ఇల్లూరు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే ఇండియా పేరు మార్పు

కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మనియప్పన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగానే మనదేశం పేరును మారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులుమనియప్పన్ విమర్శించారు. గురువారం డిసిసి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా కర్నూలులో పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశీలకులు మరియప్పన్ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుడు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకే ప్రతిపక్ష పార్టీలన్నీ కూటమిగా మారాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ కూటమిని బలపరచాలని ప్రజలను కోరారు. నరేంద్ర మోడీని, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని గద్దెదింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జాన్ విల్సన్ డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా ఆయా విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కర్నూలులో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మనియప్పన్, డిసిసి అధ్యక్షులు సుధాకర్‌బాబు

చివరి రోజు డ్యాన్స్ , డ్రామా ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

కన్నుల పండువగా డ్యాన్స్ డ్రామాఫెస్టివల్

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

భారత ప్రభుత్వం సాంస్కృతి మంత్రిత్వ శాఖ, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, భారత ప్రభుత్వం టిజివి.కళాక్షేత్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న డ్యాన్స్ , డ్రామా ఫెస్టివల్-2023 చివరిరోజైన గూరువారం లలితకళాసమితిలో వీక్షకుల మధ్య అబ్బుర ప్రదర్శనల మధ్య కన్నులపండుగగా సాగి ముగిసింది. మూడురోజులుగా ప్రదర్శనలిచ్చిన కళాకారులను టిజివి కళాక్షేత్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా ఇనాయతుల్లా వ్యవహరించారు. ముగింపుసభలో పత్తిఓబులయ్య, కళాకారులు యాగంటీశ్వరప్ప, బాలవెంకటేశ్వర్లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

10న ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ వర్ధంతి సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 10న చాకలి ఐలమ్మ, విద్యుత్ సత్తెనపల్లె రామకృష్ణ వర్ధంతి సభలు కర్నూలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సంఘం తీర్మానించిందని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సి.శేషాద్రి తెలిపారు. కర్నూలుకార్మిక కర్షక భవనంలో రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేవంలో వారు మాట్లాడారు. వర్ధంతి సభ సందర్భంగా కర్నూలు నగరంలోని అపార్టుమెంటు వాచ్మెన్, రజక వత్తిదారులు, లాండ్రీ షాపుల యజమానుల కర్నూలు నగర విస్తృతస్థాయి సమావేశం ఈనెల 9న మధ్యాహ్నం 2 గంటలకు కొత్త బస్టాండ్ దగ్గర గల కార్మిక కర్షక భవనంలో ఉంటుందన్నారు. ఈ వర్ధంతి సభకు ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య హాజరవుతున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో ఉండే అపార్టుమెంట్ వాచ్మెన్ రజక వృత్తిదారులు, లాండ్రీ షాపుల యజమానులు, మేధావులు రజక ఉద్యోగస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

ఉట్టిని కొడుతున్న శ్రీకృష్ణ వేషధారి

శ్రీ విద్యా సాయి స్కూల్లోఘనంగా కృష్ణాష్టమి

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండల కేంద్రంలో శ్రీ విద్యాసాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూలులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులతో శ్రీకృష్ణ రాధా,గోపికలు వేషధారణలతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. గోపికలతో తాళ్లను లాగడం, రాధాకృష్ణులు ఉట్టి కొట్టడం చాలా ముచ్చటగా సాగింది. హై స్కూల్ కరస్పాండెంట్ యజ్ఞం వెంకట్ మాధవ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల పిల్లలకు పండుగల విశిష్టత గురించి తెలుస్తుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు బాల సునీత , ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలను అణచి వేసిన చంద్రబాబు

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బడుగు బలహీనవర్గాలను అన్ని విధాలుగా అణచి వేసిన దుర్మార్గుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో పత్రికా విలేకరులతో మాట్లాడారు. చంద్ర బాబు నాయుడు పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో బడుగు బలహీనవర్గాల నాయకులను అన్ని విధాలుగా అణచి వేశాడని అన్నారు. వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీలకు రాజకీయంగా , అన్ని రంగాలలో అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని అరన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలను గత నలభై సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రజలెవరూ సిద్ధంగా లేరని అన్నారు. ఎలా గోలా ప్రజలను మభ్యపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో బిసి,ఎస్‌సి, ఎస్‌టి,మైనారిటీలకు రాజ్యాధికారంలో అత్యున్నత స్థానం కల్పిస్తున్న ఏకైక నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని ఆయన కొనియాడారు. జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్ళీ గెలిపించుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు ,లోకేష్ యాత్రలకు ప్రజల్లో స్పందన లేనందువల్లనే తమ కార్యకర్తలను రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైసిపి కార్యకర్తలు నిజంగానే దాడులు చేయాలనుకుంటే చంద్రబాబు, లోకేష్ హైదరాబాద్ నుండి రాష్ట్రంలో అడుగుపెట్టలేరని బోస్ హెచ్చరించారు. వచ్చే ఎన్నికల అనంతరం చంద్రబాబు, లోకేష్ ఓటమి పాలై రాష్ట్రం వదిలి వెళ్ళిపోతారని జోష్యం చెప్పారు.

ఎదురెదురుగా వచ్చి రెండు ఆటోలు ఢీ

- వ్యవసాయ కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి

సంఘటన స్థలంలో ఉన్న ఆటో

ఆస్పరి సమీపంలోని కర్నూలు రహదారిలో ఎదురెదురుగా వచ్చి రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... గురువారం జోహరాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కాశీ విశ్వనాథ్ కూలీలను ఆటోలో ఎక్కించుకొని, ఆస్పరి గ్రామంలో మరి కొంతమంది కూలీలను ఎక్కించుకుని దేవనకొండ మండలంలోని రైతులకు పత్తి పంట కోతకు బయల్దేరారు. కూలీల ఆటోను బిల్లేకల్లు నుంచి ఆస్పరికి వస్తున్న ఖాళీ ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆస్పరి గ్రామానికి చెందిన కోసిగి వెంకటేశ్వరమ్మకు కాలు, చేయి విరగగా, జోహరాపురం గ్రామానికి చెందిన సంతోషమ్మ, అంజినమ్మ, కర్రెన్న, పులి కొండమ్మ, నారాయణమ్మ, రంగమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

108 వాహనం చెంతనే ఉన్నా సేవలు కరువు

- సకాలంలో స్పందించని ఆస్పరి 108 సిబ్బంది

ఆస్పరికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ప్రమాదం ఉదయం 7గంటలకు జరిగినా 3 కిలోమీటర్లలో ఉన్నా సంఘటన స్థలానికి వెళ్లేందుకు గంటపైనా అయినప్పటికీ 108 సిబ్బంది వెళ్లలేకపోయారు. స్థానిక ఎస్ఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పరి ప్రాథమిక ఆస్పత్రికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. స్థానిక 108 సిబ్బంది స్పందించకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలూరు 108 సిబ్బంది ఆస్పరి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను ఆదోని ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దళిత హక్కుల పరిరక్షణకు కలిసి రావాలి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

దళిత హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం కోరారు. గురువారం దళితుల రక్షణ యాత్ర భాగంగా ఎమ్మిగనూరు చర్మకారుల సమస్యలపై పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చర్మకారుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. చర్మకారుల జీవన స్థితిగతులు మెరుగయ్యేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. చర్మకారుల జిల్లా నాయకులు సుమాల ఆంథోని, చర్మకారుల నాయకులు సుమాల రాజు, ఎం.కాలేబు, మహారాజ్, సురేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియను

వీలైనంత త్వరగా పూర్తిచేయాలి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తెలిపారు. గురువారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని 68 పోలింగ్ కేంద్రాల బిఎల్ఒలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఓటరు జాబితా పరిశీలన ఇంటింటి సర్వే వంద శాతం పూర్తయిందని తెలిపారు. ఓటరు జాబితాలో శాశ్వతంగా వలస పోయిన వారిని గుర్తించడం, చనిపోయిన వారిని తొలగించడం, మార్పులు, చేర్పులు లాంటి ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిలో ఏర్పాట్లను కూడా సరి చూడాల్సి ఉంటుందని తెలిపారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ నాగేష్, ఎఒ బాబు భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రశాంతంగా 'వినాయక చవితి'

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణంలో వినాయక చవితి పండగను జరుపుకోవాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో వినాయక చవితి ముందస్తు ఏర్పాట్లపై అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో పండగలు జరుపుకోవాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో రహదారుల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని, వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని తెలిపారు. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో పండగను విజయవంతం చేయాలని సూచించారు. మద్యం దుకాణాలు ఒక రోజు పాటు మూసి ఉంచాలని ఆదేశించారు. ప్రతేడాది మాదిరిగానే ఈఏడాది కూడా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని తెలిపారు. గణేష్ మండపాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపానికి ఒకరు లేదా ఇద్దరు ఇన్‌ఛార్జీలను నియమించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వినాయకుని నిమజ్జనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. నిమజ్జన స్థలాల్లో లైటింగ్, బ్యారికేడ్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా నిమజ్జన పాయింట్‌లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా అందరూ గణేష్ మండలి నిర్వాహకుల పూర్తి వివరాలు అందించాలని కోరారు. ప్రతి మండపం సమాచారం తప్పనిసరి అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో మండపాల వద్ద చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అన్ని గణేష్ మండపాల వద్ద పోలీసు పెట్రోలింగ్ పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు ప్రణాళికాబద్ధంగా చేయాలని తెలిపారు. వినాయక నిమజ్జనానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, వినాయక ఉత్సవాలు, నిమజ్జనం ప్రాంతం వద్ద బ్యారికేడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బసాపురం పరిధిలో నిమజ్జనం ఏర్పాట్లు గతేడాది కంటే ఈఏడాది ఎక్కువగా క్రేన్స్, బారికేడ్లు, లైటింగ్, గజ ఈతగాళ్లు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డిఎస్పీలు శివ నారాయణ స్వామి, సీతారామయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్లు వెంకటలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మేజర్ పంచాయతీ సర్పంచి చలువాది రంగమ్మ ఆధ్వర్యంలో ఉప సర్పంచి మీనాక్షి, కార్యదర్శి రాజశేఖర్ 6వ వార్డు మెయిన్ రోడ్డు గుంతలమయం కావడంతో గురువారం మరమ్మతులు చేపట్టారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, సమస్య పరిష్కరించాలని సర్పంచి, కార్యదర్శికి ప్రజలు విన్నవించడంతో స్పందించిన సర్పంచి తనయుడు చలువాది పంపాపతి, కార్యదర్శి రాజశేఖర్ జెసిబి ద్వారా రహదారిని చదును చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వార్డు సభ్యులు రవికాంత్, హమీద్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేయిస్తున్న నాయకులు, కార్యదర్శి

ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్

- మండగిరిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

నాలుగున్నర ఏళ్ల పాలనలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, టిడిపి వైపు ప్రజలు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మండిగిరిలోని 20వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాశక్తి పేరుతో ప్రకటించిన పథకం ద్వారా మహిళా సాధికారత చేకూర్చడం, తల్లికి వందనం కింద బిడ్డలను చదివించేందుకు ఒక్కొక్కరికి రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు పైబడి 60 ఏళ్లలోపు వయసున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, ఇంటింటికి ఉచితంగా రక్షిత తాగునీటి కుళాయి కల్పించనున్నామని తెలిపారు. నవరత్నాల పేరుతో వైసిపి ప్రభుత్వం కొందరికే పథకాలను పరిమితం చేసి ఇబ్బందులు గురి చేస్తోందని విమర్శించారు. టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి, నాయకులు రంగస్వామి నాయుడు, చాంద్ బాషా, బుద్ధారెడ్డి, లక్ష్మీనారాయణ, రవి, ఈరన్న, రామదాస్, సురేంద్ర, చాకలి మల్లప్ప, వలీ బాష, నూర్ అహ్మద్, తిక్కన్న పాల్గొన్నారు. అలాగే మండగిరి గ్రామ పంచాయతీలో బాబా గార్డెన్, మల్లికార్జున స్కూల్ ప్రాంతాల్లో 'భవిష్యత్తు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే రోజుల్లో కూడా టిడిపి ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, రాష్ట్ర బీసీ సెల్ మాజీ కార్యదర్శి వద్దేమాన్ గోపాల్, జిల్లా తెలుగు యువత నాయకులు గుడిసె రామకృష్ణ, సాధిక్ వలీ, గిరి, బైచిగేరి ఓంకారప్ప, ధణాపురం నాగిరెడ్డి, పెద్దతుంబలం నర్సప్ప, చిరంజీవి, భరత్ కుమార్, మండగిరి బాబురావు, ఇందిరానగర్ వీరేష్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని కుంటనహాల్ గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. గ్రామంలో ప్రజా వేదికను ఏర్పాటు చేసి టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి మాట్లాడారు. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టించే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని తెలిపారు. టిడిపి నాయకులు చిన్న బసప్ప, వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, కొట్రేష్ గౌడ్, టిప్పు సుల్తాన్, దొడ్డన్న గౌడ్, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, కురుగోడు, మంజు, రాజబాబు, కాత్రికి చంద్ర పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి మండల యువ నాయకులు, దేశాయి నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న మీనాక్షి నాయుడు

కౌతాళంలో మేనిఫెస్టోను వివరిస్తున్న తిక్కారెడ్డి

ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె కృష్ణమ్మ

నందవరంలో పథకాలను వివరిస్తున్న గురురాజ్ దేశాయి

మాట్లాడుతున్న మైనార్టీ టిడిపి సెల్ నాయకులు

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో

అంజాద్ బాష జోక్యం తగదు

- టిడిపి మైనార్టీ సెల్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాష జోక్యం తగదని టిడిపి మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు హుస్సేన్ సాబ్, ప్రధాన కార్యదర్శి తురెగల్ నజీర్ విమర్శించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 9న విజయవాడలో రాష్ట్ర ముతవల్లిల కోట కింద జరిగే రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ నియామక ఎన్నికల్లో అంజాద్ బాష కడప, కర్నూలు, అనంతపురం నగరాలకు వచ్చి ముతవల్లిలతో సమావేశం నిర్వహించి షేక్ ఖాజాకు ఓటు వేయాలని, ఇతరులకు ఓటు వేస్తే తెలిసిపోతుందని వారిని ముతవల్లి పదవి నుంచి తొలగిస్తామని బెదిరించడం నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. మైనారిటీ శాఖా మంత్రిగా ఉండి మైనారిటీలకు ఏం చేశారో, ఏం సాధించారో చెబితే బాగుంటుందని ప్రశ్నించారు. అసెంబ్లీలో మైనారిటీలకు సబ్‌ప్లాన్ కింద రూ.8 వేల కోట్లు మంజూరు చేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మైనారిటీలకు జనాభా ప్రాతిపదికన 8.8 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. వైసిపి కాలం దగ్గర పడిందని, మంచి చేయాలని అనుకుంటే చేయాలని తెలిపారు. బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

'10న సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు దీక్ష'

ప్రజాశక్తి - గోనెగండ్ల

సమగ్ర శిక్ష పథకంలో పని చేసే ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఈనెల 10న కర్నూలులో వేడుకోలు దీక్ష నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. గురువారం గోనెగండ్లలోని కస్తూరిబా పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ పథకంలో పని చేసే ఉద్యోగులందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు, ఎంటిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. డిఎ, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. విరమణ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.10 లక్షల వరకు పెంచి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు పుల్లన్న, రవికుమార్, శ్రీనివాసులు, గోవిందరాజులు, కవిత, స్రవంతి, మంజుల, ఉషారాణి, హసీనా, రమాదేవి, ప్రమీల, ఉమా, సుభాషిని పాల్గొన్నారు.

ఘన చరిత్ర ఉంది.. వెనకబడ్డాం

- కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

దేశానికి, రాష్ట్రానికి ప్రధానులను, ముఖ్యమంత్రులను అందించిన ఘనత ఉందని, అభివృద్ధిలో మాత్రం జిల్లా చాలా వెనుకబడి ఉందని కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు మైనా ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ కలిశారు. 'ప్రస్తుత విద్యా వ్యవస్థ, విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా వేత్తలతో, మేధావులతో జిల్లా విద్యారంగ అభివృద్ధికై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలూరు పట్టణంలో ఈనెల 23, 24న ఇబ్రహీం ఫంక్షన్ హాలులో సదస్సు ఏర్పాటు చేశామని చెప్పారు. తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధిలో జిల్లా చాలా వెనుకబడిందని తెలిపారు. పదవుల్లో ఉన్న వారికి అనుభవాలు తెలియక స్వప్రయోజనాల కోసం పరితపిస్తారే తప్ప విద్యాభివృద్ధికి పాటుపడదామని ఏ నాయకునికీ లేదన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యా పోరాటాలకు తమ సంఘీభావం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. వినోద్, కరెంటు గోవిందు పాల్గొన్నారు.

విద్యార్థుల ద్రోహి జగన్మోహన్ రెడ్డి

- టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యా వ్యతిరేక విధానాలతో ఎందరో విద్యార్థులను విద్యకు దూరం చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల ద్రోహిగా మారారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు విమర్శించారు. గురువారం జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ, ఆదోని నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బెస్త జయ సూర్య, బల్లేకల్ సూర్య ఆధ్వర్యంలో 'ఫీజు ఎక్కడ కంస మామ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతేడాది రూ.15 వేలు ఇస్తానని చెప్పి నేడు రూ.13 వేలు ఇస్తూ కోతలు విధిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, నాడు-నేడు ద్వారా నాసిరకం పనులతో అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల పెచ్చులూడి ఎందరో విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు పాటుపడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో విద్యార్థుల ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. నాయకులు రవి కుమార్, నూర్ బాషా, తాహెర్, గౌతం, మహేష్, విశ్వం, భరత్, మంజు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం గురువారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారి దర్శనం కోసం ఆంధ్రా రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తుంగభద్ర దిగువ కాలువలో భక్తులు స్నానాలు ఆచరించి తడిగుడ్డలతోనే స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని వండి పూజలు చేశారు. మరి కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. పాలకమండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, సూపరింటెండెంట్లు రామ్మోహన్, వెంకటేష్, దేవాలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పర్యవేక్షించారు.

ఎల్ఎల్‌సిలో స్నానాలు చేస్తున్న భక్తులు

2 వేల మందికి అన్నదానం : శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలోని నిత్యాన్నదానంలో ఓ కుటుంబం 2 వేల మందికి అన్నదానం నిర్వహించింది. కౌతాళం మండల కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్ బంధువులు అనిత, పీర్ బాష ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సూపరింటెండెంట్ రామ్మోహన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, దాతల కుటుంబ సభ్యులు సబ్జాన్, బాబమ్మ, అసలమ్మ, శేఖరన్న, షరీఫ్ పాల్గొన్నారు. అంతకుముందు దాతల కుటుంబం పేరు మీద దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని భాష్యం స్కూలులో గురువారం శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సదాశివ మాట్లాడుతూ... విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు, పోలీసులు, లాయర్లుగా తీర్చిదిద్దడం ఒక్క ఉపాధ్యాయునికే సాధ్యమన్నారు. పిల్లల వేషధారణ చూపరులను అలరించాయి. ప్రధానోపాధ్యాయులు అర్షియా, ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, సురేష్, రాజశేఖర్, గ్రేస్ లలిత, చిట్టిబాబు, షేక్షావలీ, నాగరాజ్, గురుస్వామి, వీరేష్, కౌసర్, ప్రియాంక పాల్గొన్నారు. అమరావతి స్కూల్ విద్యార్థులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పిల్లలు గోపిక, శ్రీకృష్ణుని వేషధారణలో అలరించారు. కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో విద్యార్థులు ధరించిన శ్రీకృష్ణుని వేషధారణ ఆకట్టుకుంది. నరేష్ ఆచారి ఆధ్వర్యంలో బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలు ధరించి అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు దీప్తి, సతీష్ కుమార్, జ్యోత్స్న, అంజి, ఈశ్వర్, గాయత్రి, రేష్మా, అంజినమ్మ, పద్మావతి, శ్రీదేవి, గంగమ్మ, విష్ణు, సంజన్న, నారాయణ పాల్గొన్నారు. **హొళగుంద** మండలం గజ్జహళ్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉట్టి కొట్టే సన్నివేశం కనుల పండువగా సాగింది. **చిప్పగిరి** మండలంలోని నగరడోనా గ్రామంలో శ్రీకృష్ణుని ఆలయంలో యాదవ కమిటీ సభ్యులు ఎర్రి స్వామి, వెంకటేశ్వర్లు, కొండప్ప, రంగన్న, అంజి, శివయోగి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారికి వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్వామి వారు ఊరేగింపు చేపట్టారు. యువకులు పెద్ద ఎత్తున రంగు నీళ్లతో ఉట్టి కొట్టే వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల గోపిక, రాధమ్మ వేషధారణలు ఆకట్టుకున్నాయి. పగడాల ఎర్రిస్వామి అన్నదానం నిర్వహించారు. సుంకయ్య, సంజన, సంజీవ రాయుడు, రామాంజనేయులు, రంగస్వామి పాల్గొన్నారు. నగరడోనా గ్రామంలో చేపట్టిన శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ రూ.50 వేలు విరాళం అందజేసినట్లు యాదవ కమిటీ సభ్యులు తెలిపారు. **మంత్రాలయం**లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు చిన్నికృష్ణుల వేషధారణలకు ముగ్ధులై అక్కున చేర్చుకొన్నారు. శ్రీమఠంలో కొందరు మాతృమూర్తులు బిడ్డలను చిన్ని కృష్ణుని వేషధారణలో అలంకరించగా, మరికొందరు చిన్నారులను గోపికల వేషాలు వేయించి ముచ్చట పడ్డారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు చిన్నారులను ఎత్తుకొని ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు, భక్తులు శ్రీమఠం ఆవరణలో రంగుల నీళ్లతో ఒకరిపైఒకరు చల్లుకున్నారు. శ్రీమఠం ముఖద్వారం ఎదురుగా ఉట్టిని ఏర్పాటు చేసి శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను ఆహ్వానించగా ఆయన ఉట్టిని కొట్టి ఆనంద పరిచారు. **ఆలూరు** మండలంలోని మొలగవల్లి, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మొలగవల్లి గ్రామంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు రథోత్సవం నిర్వహించారు. చిన్నారుల డ్రమ్స్, మంగళ వాయిద్యాలతో స్వామి వారి రథోత్సవం పురవీధుల గుండా సాగింది. ఆటపాటలతో అలరించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. యాదవ సంఘం నాయకులు రంగస్వామి యాదవ్, అంజినయ్య, రాంనాథ్ యాదవ్, అశోక్ యాదవ్, పటేల్ యాదవ్, యంకన్న, మాణిక్య, గోపిని వీరచంద్ర, బంగారు నరసప్ప, నరసింహులు, మురళీ, శ్రీరాములు, లింగన్న, మారెన్న, లక్ష్మీకాంత్, రాధాకృష్ణ, గోపాల్, శీనప్ప, అఖిల్, రాజు, ముని పాల్గొన్నారు.

ఆస్పరిలో

ఆదోనిలో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు

ఆలూరులో ఊరేగిస్తున్న నాయకులు

'యువగళం' కాదు.. 'యమగళం'

- భీమవరం ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం పాదయాత్ర.. యమగళం పాదయాత్ర'గా మారిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాదు నుంచి ఫోన్ ద్వారా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపుపై నమ్మకం లేకనే టిడిపి నాయకులు హింసను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. మొన్న పుంగనూరులో చంద్రబాబు సమక్షంలో జరిగిన ఘటన, భీమవరంలో లోకేష్ ప్రోద్భలంతోనే అల్లరి మూకలను రెచ్చగొట్టి దాడులను ప్రోత్సాహించారని తెలిపారు. లా అండ్ ఆర్డర్‌ను సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేశారని మండిపడ్డారు. ఈ దాడుల వల్ల పోలీసులు సహనం కోల్పోయి కాల్పులు జరుపుతారని తెలిపారు. అలా కాల్పులు జరిపితే కొందరైనా మరణిస్తారని, వారి మృతదేహాలతో శవ రాజకీయాలు చేయాలని బాబు, లోకేష్ తాపత్రయమని విమర్శించారు. భీమవరంలో లోకేష్ యాత్ర కంటే ముందుగా వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీపై వాటర్ బాటిల్, రాళ్లు రువ్వడంతో పాటు ఫ్లెక్సీని తొలగించడానికి ప్రయత్నించారని తెలిపారు. పుంగనూరులో టిడిపి శ్రేణుల దాడి ఘటనలో ఒక కానిస్టేబుల్‌కు కన్ను కూడా పోయిందని చెప్పారు. 40 మంది పోలీసులు గాయపడ్డారని తెలిపారు. భీమవరం ఘటనలో ముగ్గురు పోలీసుల తలలకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి ఎన్ని కుట్రలు చేసినా వారి కల నేరవేరదని జోస్యం చెప్పారు. హింసను ప్రేరేపిస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదన్నారు. చంద్రబాబు పాలనంతా అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడడం జరిగిందన్నారు. ఐదేళ్ల పాలనలో ఇంతా అవినీతి జరిగిందని, బయటకు వస్తే 45 ఏళ్ల రాజకీయ జీవితంలో బాబు ఎన్ని మోసాలకు పాల్పడ్డారో అర్థం అవుతుందన్నారు. 2024లో కూడా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

లోపాల్లేకుండా తుది ఓటర్ల జాబితా

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఎలాంటి లోపాలకూ తావివ్వకుండా తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై తహశీల్దార్ వెంకట లక్ష్మీ, ఎంపిడిఒ గీతావాణి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డిఎల్‌పిఒ శ్రీనివాసులుతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటి సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా జనవరి 5, 2024న పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎఈఆర్ఒ, బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కి సంబంధించిన శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇంటింటి సర్వే 99.70 శాతం, 2,51,573 ఓటర్లకు గాను 2,50,821 ఓటర్ల సర్వే పూర్తి చేశామని తెలిపారు.



శ్రీశైలానికి కొనసాగుతున్న ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 6 గంటలకు సమయానికి జూరాల నుండి 16,048 క్యూ సెక్కులు, సుంకేసుల ద్వారా 12933 క్యూస్సెకులు మొత్తం కలిపి 28,981 క్యూస్సెకులు జలాశయానికి చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 8 52.5 0 నీటి నిలువ సామర్థ్యం 85.7503 టీఎంసీలుగా నమోదయింది. అలాగే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా సుజలా స్రవంతికి 1315, పోతిరెడ్డి పాడుకి 1500, మహాత్మా గాంధీ కల్వకుర్తి లెఫ్ట్ ఇరిగేషన్‌కు 2033 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తెలంగాణ ప్రాంత పరిధిలోని ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 339 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తూ 0.179 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని తయారు చేశారు. ప్రస్తుతానికి కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు.

పగిడ్యాల మండలంలో ప్రబలిన అతిసార

- బీరవోలు, ఆంజనేయ నగర్, పగిడ్యాలలో 46 కేసులు నమోదు
- బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి : ఎమ్మెల్యే ఆర్థర్
- గ్రామాలను సందర్శించిన డిఎంహెచ్‌ఒ, డిపిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని బీరవోలు, ఆంజనేయ నగర్, పగిడ్యాల గ్రామాలలో అతిసార ప్రబలుతోంది. రోజు రోజుకు కేసులు పెరుగుతున్నాయి. బీరవోలు గ్రామంలో 28, పగిడ్యాలలో 10, ఆంజనేయ నగర్‌లో 8 కేసులు ఇప్పటివరకు నమోదయ్యాయని వైద్య అధికారి డాక్టర్ మోహన్ తెలిపారు. కలుషిత నీటి వలనే అతిసారా సోకిందని వైద్యులు చెబుతున్నారు. గత మూడు రోజుల క్రితం వర్షాలు కురవడంతో ఎక్కడో పైపు లీకేజీ అయి వర్షపు నీరు అందులోకి వెళ్లి ఆ నీరు సరఫరా కావడంతో ఆ నీరు తాగి అతిసార బారిన పడి ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు. **నీటి సరఫరా నిలుపుదల :** అతిసారా సోకిన గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి నీటి సరఫరాను నిలుపుదల చేసినట్టు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఆర్వో కేంద్రం, ట్యాంకర్ల ద్వారా నుంచి నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. వాడుకోవడానికి పెద్ద ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ఆర్థర్

పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తంగా ఉండాలని, అతిసార వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ వైద్య సిబ్బందికి సూచించారు. పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం వైద్య సిబ్బందితో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వివరాలను, మందులను వైద్య అధికారి మోహన్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, వైసిపి నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, రాజు, నందికొట్కూరు కౌన్సిలర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్‌ఒ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకటరమణ సందర్శించారు. అనంతరం పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాల్లో ఆయన పర్యటించి అధికారులకు, వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చి అప్రమత్తం చేశారు. అతిసార వ్యాధి కేసులు పెరుగుతుండడంతో బ్రాహ్మణకొట్కూరు, జూపాడు బంగ్లా, పారుమంచాల గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులను, వైద్య సిబ్బందిని పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పిలిపించారు. 24 గంటలు విధులు నిర్వహించేలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. గ్రామాలలో వాంతులు, విరోచనాలు అవుతుంటే వైద్య అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఆశా వర్కర్లపై, ఏఎన్ఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

సమస్య ఎక్కడుందో పరిశీలించాలి : డిపిఒ మంజులవాణి

నీటి సమస్య ఎక్కడ ఉందో పరిశీలించాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి మంజుల వాణి పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని బీరవోలు, ఆంజనేయ నగర్, పగిడ్యాల గ్రామాలలో ఆమె పర్యటించారు. గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఇఒఆర్‌డి నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి కలుషితంపై అనుమానాలు : డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

నీటి కలుషితం వల్లే అతిసారా సోకి ఉండొచ్చని ఆత్మకూర్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్ తెలిపారు. పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన సందర్శించారు. నీటిని పరీక్ష నిమిత్తం పంపించామని, పూర్తిస్థాయి చికిత్స అందించే అన్ని మందులు ఇక్కడ ఉన్నాయని చికిత్స పొందుతున్న వారికి ధైర్యం చెప్పారు.

చికిత్స పొందుతున్న అతిసారా బాధితులు

చికిత్స పొందుతున్న బాధితుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఓ వెంకటరమణ

మాట్లాడుతున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు

సైకో పోవాలి.. సైకిల్ రావాలి..

- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ప్యాపిలిలో జిల్లా నేతలు ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో సైకో పోవాలి, సైకిల్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా నుంచి నంద్యాల జిల్లాలోని బనగానపల్లెకు వెళ్తున్న సందర్భంగా ప్యాపిలిలో చంద్రబాబు నాయుడుకు జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, డోన్ నియోజక వర్గ ఇన్చార్జి ధర్మారం సుబ్బారెడ్డి, అధికార ప్రతినిధి నాగేశ్వరరావు యాదవ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. ప్యాపిలి ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. ప్రజల్లో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, జగన్ ఓటమి ఖాయమైందని, కేవలం తెలుగుదేశం పార్టీ వాళ్లు మాత్రమే కాదు, ఎపిలో చాలామంది ప్రజలు ఇదే కోరుకుంటున్నా రని తెలిపారు. పలువురు ఎన్నారైలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారని అన్నారు. రాయలసీమ ప్రాంతంలో గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ప్రజలు కూడా అధికార వైసిపికి గట్టి బుద్ధి చెప్పారని, దాంతో నిన్న మొన్నటి వరకు వై నాట్ 175 అంటూ అడిగిన జగన్‌కు కోలుకోలేని షాక్ అనే చెప్పవచ్చన్నారు. పట్టభద్రులు ఇంతగా బుద్ధి చెప్పినప్పటికీ అధికార వైసిపి మాత్రం బయటకు చెబుతున్నది ఈ మాత్రం దానికే సంబరాలా అని; కానీ లోలోపల మాత్రం వైసిపి నాయకులు, అధినేత కూడా ఘోర పరాజయంగా భావిస్తున్నా రని చెప్పారు. వైసిపిని కూకటి వేళ్ళతో పెకిలించా లన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వలసల రామకృష్ణ, రాఘవేంద్ర, అంకిరెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్, చిన్న సుంకయ్య, సుదర్శన్, పెద్ద రామాంజనేయులు, నాగేంద్ర, మధు, చల్లావీర, ఖాజా పీర్, అభి, దీపు, మధు, ఎస్‌కె వలి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నంద్యాలకు చంద్రబాబు రాక

- బహిరంగ సభ ఏర్పాట్లను టిడిపి నేతలు పరిశీలన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నేడు నంద్యాల జిల్లా కేంద్రంకు రానున్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టనంలో బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పట్టణంలోని రాజ్ థియేటర్ సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పర్యటన ఇన్‌ఛార్జి ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు పోతురాజు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, విత్తనాభివృద్ధిశాఖ మాజీ ఛైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, న్యాయవాది తులసిరెడ్డిలు పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నేడు సాయంత్రం 5 గంటలకు రాజ్ థియేటర్ సర్కిల్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. 9వ తేదీ ఉదయం 11.30 గంటలకు పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం, కార్యకర్తల సమావేశం, అనంతరం చంద్రబాబు పర్యటన ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కోరారు. **నంద్యాల రూరల్ :** నేడు చంద్రబాబు నాయుడు నంద్యాల పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మీనిగ లక్ష్మయ్య కోరారు. నంద్యాల పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

నేడు జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళలతో చంద్రబాబు ముఖాముఖి

బనగానపల్లె : బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా నేడు మహిళలతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం లోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

అంత్యక్రియలు అడ్డుకున్నారని

మృతదేహంతో దళితుల ఆందోళన

ప్రజాశక్తి - చాగలమర్రి

అంత్యక్రియలు చేయకుండా అడ్డుకున్నారని మృతదేహంతో చాగలమర్రి మండలం తోడేండ్లపల్లె గ్రామ దళితులు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన మార్కు(65) ఈనెల 6న అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలో దళితులు గతంలో మృతదేహాలను పూడ్చుకునే శ్మశానంలో గుంతను తీసి అంత్యక్రి యలకు సిద్ధమయ్యారు. గ్రామానికి చెందిన సంజీవ రాయుడు కుటుంబీకులు స్థలం తమదంటూ గుంత తీయకుండా అడ్డుకున్నారు. దీంతో మృతుడి బంధువులు, మరి కొందరు మృతదేహాన్ని తీసుకుని స్థానిక తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టారు. కార్యాలయానికి తాళం వేసి బైఠా యించారు. బాధితులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సంజీవరాయుడు తమ స్మశాన వాటికను కూడా కబ్జా చేశారని ఆరోపించారు. కాలనీలో ఎప్పుడు ఎవరు చనిపోయినా పూడ్చేప్పుడు ఇదే సమస్య ఎదురౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సుభద్రమ్మ తోడేండ్లపల్లె గ్రామంలోని వివాదస్పద స్థలానికి చేరుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు, ఎస్సై రమణయ్యలు దళితులతో చర్చించి సర్వే చేసి కొలతలు వేసి స్మశాన వాటికకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. దీంతో ధళితులు శాంతించి మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి చేరుకుని అంత్యక్రియలు నిర్వహించుకున్నారు.

మృతదేహంతో ఆందోళన చేస్తున్న దళితులు

రెండు వేల నోట్ల పేరుతో మోసం

- నిందితులు అరెస్టు
- రూ. 70 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఐదు వందల రుపాయాల నోట్లకు అధికంగా 15 శాతం కమిషన్ కలిపి 2 వేల రూపాయల నోట్లు ఇస్తామని మోసం చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సిఐ ఎం.దస్తగిరి బాబుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నూనెపల్లికి చెందిన శ్రీనివాస రెడ్డి, అతని స్నేహితులను 5 మంది వ్యక్తులు పరిచయం చేసుకొని 2000 రూపాయలు రద్దు అవుతున్నాయని, 500 రూపాయల నోట్లు ఇస్తే వాటికి 15 శాతం కమీషన్ కలిపి 2 వేల రూపాయల నోట్లు ఇస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి రూ. 70 లక్షలు 500 నోట్లను స్వాధీనం చేసుకుని బాధితులకు రికవరీ చేసినట్లు తెలిపారు. ముద్దాయిలు టంకాల శోభన్ బాబు, కంచరణ చిన్నబాబుతోపాటు మరో ఆరుగురు భాధితులను రైతునగరం గ్రామము దగ్గరకు జులై నెల 20న పిలిపించుకొని శ్రీనివాస రెడ్డి దగ్గర, అతని స్నేహితుల దగ్గర మొత్తం 2 కోట్ల 20 లక్షల రూపాయాలు తీసుకుని ఉడాయించా రని ఫిర్యాదు చేయగా జులై 22న నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారన్నారు. ఈ క్రమంలో రూరల్ సీఐ ఎం.దస్తగిరి బాబు, తాలూకా ఎస్ఐ రామ మోహన్ రెడ్డి, నంద్యాల మూడవ పట్టణ ఎస్ఐ బాబు, సిబ్బందితో కలిసి రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గుంతకల్, వైజాగ్ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా ఈ నెల 6న ముద్దాయిలు టంకాల శోభన్ బాబు, కంచరణ చిన్న బాబులను విశాఖపట్టణంలోని మాధవ ధారా ప్రాంతంలో, కుంచుమంభ గుడి వీధిలో గల ఏ4 ముద్దాయి ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో ఇంకా 6 మంది ముద్దాయిలు అరెస్టు కావాల్సి ఉందని వెల్లడించారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సిఐలు, ఎస్ఐలను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినంధించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిచయం లేని వ్యక్తులు వచ్చి చెప్పే మాయ మాటలు నమ్మొద్దని డిఎస్‌పి ప్రజలకు సూచించారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రతి రైతు సాగు చేసిన పంటను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని యనకండ్ల , తమ్మడపల్లి గ్రామాల్లో ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. అనంతరం యనకండ్ల, తమ్మడపల్లె గ్రామాల్లో ఆర్‌బికెలను పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ నిల్వలు పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓబులేసు, వ్యవసాయ విస్తరణ అధికారులు యుగంధర్, నవీన్ రెడ్డి, ఎంపీఈఓ సుప్రజ పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

- మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన చాంద్ బాషాకు ముగ్గురు ఆడ బిడ్డలు అంగవైకల్యంతో బాధపడుతూ మంచాన పడ్డారు. బిసి రాజారెడ్డి యనకండ్ల గ్రామానికి వెళ్ళినప్పుడు వారి పరిస్థితిని చూసి చలించిపోయి, గత కొన్నేళ్లుగా సొంత డబ్బుతో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ప్రతినెల రూ.1500 పంపిణీ చేస్తున్నారు. అలాగే విషయాన్ని స్థానిక వసుధ ఫౌండేషన్ తరపున సేవలు అందిస్తున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పరిస్థితిని వసుధ ఫౌండేషన్ దష్టికి తీసుకెళ్లగా చైర్మన్ వెంకటరామరాజు స్పందించి ముగ్గురికి పింఛన్ ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ప్రతినెల రూ. 3 వేలు ప్రకారం వారి జీవితాంతం అందజేయనున్నారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మంతెన వెంకటరామరాజు వసుధ ఫౌండేషన్ ఏర్పాటు చేసి గత 15 ఏళ్ల నుంచి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు, నిరుపేదలకు వారు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రపంచ మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, లాయర్ నాగేంద్ర రెడ్డి, బొబ్బల మహేశ్వరరెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు రేగటి నాగిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఖాదర్ భాషా, నాయకులు టిప్ టాప్ కలాం, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ఎన్నికైన గణేష్‌మహోత్సవ కేంద్ర కమిటీ

గణేష్ మహోత్సవ కేంద్ర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల : గణేష్ ఉత్సవాల నిర్వహణ, మంటప నిర్వాహకులు, అధికార యంత్రాంగం మధ్య సమన్వయ కర్తలుగా వ్యవహరించే ప్రక్రియలో భాగంగా నంద్యాల రెవెన్యూ జిల్లా నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నట్లు కర్నూలు జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గౌరవ సలహా సమితి సదస్యులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, గౌరవాధ్యక్షులుగా రామకృష్ణా రెడ్డి, అధ్యక్షులుగా చిలుకూరి శ్రీనివాస్, కార్యాధ్యక్షులుగా యర్రం విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోదాల రామాంజనేయులు, అన్ని మండలాల నుండి ప్రాతినిధ్యం ఉండేలా ఉపాధ్యక్ష, కార్యదర్శి, సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

- నేడు గోస్పాడు నుండి ప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజా ఫిర్యాదులకు మెరుగైన పరిష్కారం కోసం మండల స్థాయిలో నేటి నుండి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలో ప్రతి బుధవారం, శుక్రవారం రోజుల్లో మండల కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 8న గోస్పాడు, 13న శిరివెళ్ల, 15న బండి ఆత్మకూరు, 20న నంద్యాల, 22న బేతంచర్ల, 27న బనగానపల్లి, 29న పాణ్యం మండలాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ కార్యక్రమం జరిగే ప్రదేశం, వివరాలు గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

పోషకాహారం తీసుకోవాలి : డాక్టర్ శ్రావణి

ప్రజాశక్తి రుద్రవరం : గర్భిణలు, బాలింతలు పోషక విలువలు ఉండే ఆహారమును తీసుకోవాలని రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావణి తెలిపారు. గురువారం మండలంలోని శ్రీరంగాపురం 1వ అంగనవాడీ సెంటర్‌లో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ లీలాకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు రాణి, లలితమ్మ, శ్యామల, ఆశా కార్యకర్త లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ రోజా రమణి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియ పేర్కొన్నారు. భానుముక్కలలోని 11వ అంగన్వాడీ సెంటర్‌లో పోషణ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు.. మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలోని హెచ్పి పెట్రోల్ బంకు వద్ద గాజులపల్లె-నంద్యాల జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనం, క్రాంతి ట్రాన్స్పోర్ట్ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాజులపల్లె గ్రామానికి చెందిన జి.నాగ బ్రహ్మయ్య ఆచారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మహానంది పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలో ఉన్న ఐటిఐ కళాశాలలో 2023 సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒక సంవత్సరం కోర్సులో భాగంగా కంప్యూటర్, డీజిల్ మెకానిక్, రెండో సంవత్సరాల కోర్సులు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ మోటార్ వెహికల్, ఫిట్టర్ ట్రేడ్లు ఉన్నాయని, ఈ నెల 19వ తేదీ లోపల ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తప్పుడు విద్యార్హత పత్రాలపై విచారణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : తప్పుడు విద్యార్హత ధ్రువ పత్రాలు సృష్టించి గ్రంథాలయ సంస్థలో ఉద్యోగం పొందిన నాగ భాస్కర్‌పై, సహకరించిన వారిపై గురువారం నంద్యాల డిఇఒ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ అనురాధ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎస్‌సి బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాల్లో తప్పుడు విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు రావడంతో పాటు అన్ని అర్హతలుండి ఉద్యోగం కోల్పోయిన జి. స్వర్ణలత తనకు అన్యాయం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశిస్తూ డిఇఒకు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా విచారణ చేపట్టారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

ప్రజాశక్తి - పాణ్యం : విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని శాంతిరాం మెడికల్ కాలేజ్ మానసిక వైద్యురాలు డాక్టర్ సింధుజ తెలిపారు. గురువారం పాణ్యం మండలం సుగాలి మెట్ట దగ్గర ఉన్న మోడల్ స్కూల్‌లో శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ మానసిక వైద్యులు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం (సెప్టెంబర్ 10న) సందర్భంగా విద్యార్థులకు మానసిక ఒత్తిడిని జయించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లలిత, వైద్యులు పిఎస్ మూర్తి, కిషోర్ కుమార్, విష్ణుప్రియ, అవేర్నెస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వైవి రమణ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ఎన్ఐఎ సోదాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం తెల్లవారుజామున ఎన్ఐఏ సోదాలు నిర్వహించడంతో పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నంద్యాలకు చెందిన యూనిస్ నిషేధిత పాపులర్ ఫ్రంట్ సంస్థలో చురుగ్గా పని చేస్తూ ఉగ్రవాద కార్యక్రమాల నిర్వహణలో పాల్గొంటున్నాడన్న అనుమానంతో నాలుగు నెలల క్రితం యూనిస్‌ను ఎన్ఐఎ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. వారి విచారణలో యూనిస్ ఆళ్లగడ్డ పట్టణంలోని ఖుద్బా వీధికి చెందిన ఆఫ్రిదాను వివాహం చేసుకున్నట్లు తెలుసుకున్నారు. అందులో భాగంగా ఆఫ్రిదా అమ్మ, యూనిస్ అత్త రబ్రిజా ఇంట్లో గురువారం సోదాలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కార్యక్రమాల కదలికలు చోటు చేసుకున్న ఘటనలు లేవు.

గ్రంథాలయానికి పుస్తకాలు, ర్యాక్‌లు వితరణ

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని చిన్న హాస్పిటల్ దగ్గర ఉన్న గ్రంథాలయంకు పుస్తకాలు, ర్యాక్‌లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం వితరణ చేశారు. రొటేరియన్ గొల్ల జయకష్ణ, ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతరెడ్డి పుస్తకాలకు, ర్యాక్స్ వితరణకు ఆర్థిక సహాయ సహకారాలు అందించారని రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షులు దండే దస్తగిరి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి, కోశాధికారి బాలకృష్ణ, సన్నాళ్ల సాయిరాం రెడ్డి, కోటేశ్వరరావు, గ్రంథాలయ ఇన్చార్జ్ శివ, పుస్తక అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలోనే నంద్యాల అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వంలోనే నంద్యాల అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 8వ వార్డులో 145వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డు ఇంచార్జ్ నిజాంఖాన్, కౌన్సిలర్ తౌహీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో కూడా ప్రజలందరూ వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మా బున్నీసా, వార్డు నాయకులు గన్ని బ్యాగ్స్ షేక్ష, ఆమిన్, హుస్సేన్నా, రియాజ్, సలీమ్, రషీద్, దాసరి మహేష్, కాల్వ ఆదినారాయణ, కాశీం, ఫరూక్, మాలిక్ భాష, ఖాజా ఖాన్, అన్వర్, ఆర్టీసీ వలి, రసూల్, షఫీ, వార్డు ఇన్చార్జులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న వార్డు ప్రజలు

ప్రజాశక్తి
www.prajasakti.com

మొక్కలు నాటుతున్న ఐటిడిఏ పిఒ

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి : పిఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ఉద్యాన పంటన సాగుతో సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి. రవీంద్రా రెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీశైలం మండలంలోని సున్నిపెంట చెంచు గూడెంలో ఐటిడిఏ పిఒ పర్యటించారు. ఈ సందర్భంగా పిఒ ఉద్యాన వన పంటల సాగులో భాగంగా స్థానిక కుడుముల రవణమ్మ పొలము నందు ఉద్యాన వన పంటలలో ఒక రకం మామిడి మొక్కను నాటి ప్రారంభించారు. అనంతరం ఆయన చెంచులతో మాట్లాడారు. ఐటిడిఎలోని 3 జిల్లాల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన పంటల సాగు మొత్తం 3000 ఎకరాల లక్ష్యంలో భాగంగా 12 మంది చెంచులకు 21 ఎకరాలు ఉద్యానవన పంటలు వేసుకోవడానికి అనుమతి లభించిందన్నారు. ఉద్యాన వన పంటలు సాగు చేస్తే చెంచు కుటుంబాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 150 రోజుల పని దినాలు, వాటిలో అంతర్గత పంటలకోసం మూడు సంవత్సరాల సదుపాయాలను కల్పించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎం ఎన్ఆర్ఇజిఎస్ కె.జి. నాయక్, యస్.యల్.పి.సి. మెంబెర్ కుడుముల మూగెన్న, జూనియర్ సాంకేతిక సహాయకులు వెంకటేశ్వర్లు, చెంచు రైతులు పాల్గొన్నారు.

పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్ పెద్ద వెంకటస్వామి

కళాకారులకు డప్పుల పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండల కేంద్రంలో మౌలాలి స్వామి సరిగెత్తు సందర్భంగా డప్పు కళాకారులకు వేంపేట సింగిల్ విండో సొసైటీ చైర్మన్ మచ్చ పెద్ద వెంకటస్వామి 12 మందికి డబ్బులను గురువారం విరాళంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మచ్చ పెద్ద వెంకటస్వామి, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మచ్చ నాగరాజులు మాట్లాడుతూ కళాకారులు డప్పులను కొనివ్వాలని కోరగా దాదాపుగా 25 వేల రూపాయలతో వారికి డప్పు లను అందించడం జరిగిందన్నారు. కళాకారులను ప్రోత్సహించేం దుకు తమ వంతుసహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం సొసైటీ చైర్మన్‌ను డప్పు కళాకారులు సన్మానించారు.

సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సుండిపెంట భగత్ సింగ్ కాలనీలోని సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం కోరారు. వర్షాలకు పాడైన రోడ్డులను పరిశీలించి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ కాలనీలో భారీగా వర్షాలు పడ్డప్పుడు వారి ఇళ్లల్లోకి పోవాలంటే పాములు, తేళ్లు,విష పురుగులు తిరుగుతున్నాయని, ఎమర్జెన్సీ గా హాస్పిటల్ పోవాలన్న ఇబ్బందులు పడుతున్నామని,గత ప్రభుత్వం రెండు సర్వేలు చేసి ఎన్నికల కోడ్ పడిందని నిలిపివేశారని తెలిపారు. ఎమ్మెల్యేను, అధికారులను కాలనీ ప్రజలు అడిగారని కానీ ఏమాత్రం పటించుకోకపోవడం దారుణం అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి భగత్ సింగ్ కాలనీకి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. స్థానిక నాయకులు వై.శీను,బెనహర్,ఎస్. కే.వలీ, వెంకటే శ్వర్లు, అచ్చమ్మ,అంజమ్మ, పార్వతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కే. భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయం నందు గురువారం నాడు అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత మదర్ బి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కే భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలనీ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనముతో కూడిన మెడికల్ లీవ్, 300 జనాభా దాటిన మినీ సెంటర్లో మెయిన్ సెంటర్లుగా మార్చాలనీ, వర్క్‌తో సమానంగా వేతనాలు, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుండి పెండింగ్లోని బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం ఇవ్వాలని, బీమా అమలు చేయాలన్నారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు చెల్లించాలి గ్రేడ్ 2 సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించి 2022లో పరీక్ష రాసి పెండింగ్లో ఉన్న గ్రేడ్ 2 సూపర్వైజర్ పోస్టులు మిగిలిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో శివలక్ష్మి శైలజ, హరిత ,కుషిబ్బి, రమణ బాయి, సువర్ణ ,పద్మ, వెంకట్ రవణమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు భాస్కర్ రెడ్డి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణుని చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో అఖిల భారత యాదవ మహాసభ భానుముక్కల కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. యాదవులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రీ కృష్ణుని విగ్రహాన్ని పట్టణంలోని భానుముక్కల పురవీధుల గుండా ఊరేగిం పు నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, యాదవ సంఘం నాయకులు సలిక బోయిన నాగరాజు యాదవ్, బిల్లా బీముడు యాదవ్, మూలింటి గురుశేఖర్ యాదవ్, పుల్లయ్య యాదవ్, బిల్లా సుబ్బరాయుడు యాదవ్, బిల్లా శేషుయాదవ్, ఎన్.కంబగిరి రాముడు యాదవ్, బాల ఆంజనేయులు యాదవ్, ఈశ్వర్ నాయక్, మద్దయ్య యాదవ్, పూజారి నాగరాజు యాదవ్, మూలింటి అంజి యాదవ్, మొబ్బు వేణుగోపాల్ యాదవ్, మల్లికార్జున యాదవ్, ఎస్.మనోహర్ యాదవ్, సి.మనోరమణా యాదవ్, ఎస్.మద్దిలేటి, బిల్లా నాగార్జున యాదవ్, ఎస్.మదన గోపాల్ యాదవ్, ఎస్.మధు కిరణ్ యాదవ్, మూలింటి భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** పట్టణంలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక అమ్మవారి శాల ఆవరణంలో ఉన్న గీతా మందిరంలో, గోకుల కృష్ణ దేవాలయంలో, జాతీయ రహదారిలో ఏవీ గోడౌన్స్ సమీపంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌లో ఉత్సవాలు జరిగాయి. **రుద్రవరం :** మండలంలోని హరినగరం సమీపంలో ఉన్న ఇస్కాన్ అహోబిలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. యువకులకు ఉట్టిగొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి, బహుమతులు అందజేశారు. **కొలిమిగుండ్ల:** మండలంలోని అంకిరెడ్డిపల్లె గీత ఆశ్రమం నందు ఇటికాల శ్రీకృష్ణ దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో శ్రీ లలిత సుందరేశ్వర స్వామి దేవస్థానం నందు యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వై.ఎస్ నారాయణరెడ్డి బృందం సభ్యులతో గీత పారాయణ నిర్వహించారు. అనంతరం గ్రామంలో శ్రీకృష్ణుని విగ్ర హాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు మొలక హుస్సేన్ యాదవ్, గొర్రెల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్ బి జయరాముడు యాదవ్, రంగన్న యాదవ్, పుల్లయ్య యాదవ్, దంతెల వెంకటేశ్వర్లు యాదవ్, తోకల శివకృష్ణ యాదవ్ ఆంజనేయులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. **అవుకు:** పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను త్రైత సిద్ధాంత సేవాసమితి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు భగవద్గీత శ్లోకాలు వినిపించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ అధ్యక్షులు ఎస్ నరేంద్ర, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్ల, పలుకూరు, నందవరం గ్రామాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. యనకండ్ల యాదవ సంఘం ఆధ్వర్యం లో ఉట్టి ఉత్సవం, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థా నం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్య దర్శి గుండంశేషి రెడ్డి, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు నియోజక వర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు శ్రీ కాళీ ప్రసాద వృద్ధాశ్రమం, జువ్వాజి సుంకన్నా గౌడ్ సేవ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు శెట్టి మాన్ మధు యాదవ్, అధ్యక్షుడు జాల రామ్ మోహన్ యాదవ్, ఉపాధ్యక్షుడు మేకల రవికుమార్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాల సురేష్ యాదవ్, ముఖ్య అతిథి నంద్యాల యాదవ సంఘం అధ్యక్షుడు పెరుగు శివ కృష్ణ యాదవ్, కృష్ణ యాదవ్, విజయ్ యాదవ్, వెంకటేశ్ యాదవ్ బాలిస్వర్ యాదవ్, తొండ గంగాధర్ యాదవ్, నవీన్ యాదవ్, నాగరాజు యాదవ్, బంగ్లా రాము యాదవ్, సురేష్ యాదవ్, రవి యాదవ్,రమణ యాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. **కృష్ణాష్టమి వేడుకల్లో చైర్మన్..** నందికొట్కూరు పట్టణంలో శ్రీ ప్రబోధానంద ఆశ్రమం వారి ఆధ్వర్యంలో వాడాల వెంకటేశ్వర్లు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పల్లకి మోసి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొలిమిగుండ్లలో..

రుద్రవరం : ఇస్కాన్ అహోబిలంలో ఉట్టి కొట్టుతున్న యువకులు

ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రాణదాన ట్రస్ట్‌కు గురువారం నాడు అనంత పురంకు చెందిన పి.హరిప్రసాద్ విరాళం అందజేశారు. పి.హరిప్రసాద్ కుటుంబ సమేతంగా కలిసి స్వామి అమ్మవారిని దర్శించుకుని ఆతరువాత రూ.1,00,116 విరాళం పర్య వేక్షకులు హిమబిందుకు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశినట్లు ఆలయ అధికారులు తెలయజేశారు.

మద్దిలేటి స్వామికి ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి-డోన్

మద్దిలేటి స్వామికి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు గురు వారం డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ డిపో నుండి మద్దిలేటి స్వామికి రేపటి నుండి ప్రతి శుక్రవారం మరియు శనివారాలలో ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని తెలిపారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా పేట 13వ వార్డు నందు వీరనాల లక్ష్మీనారాయణ మరణించడంతో , వారి కుటుంబ సభ్యులకు గురువారం నాడు కౌన్సిల ర్ పి.శాంత కుమారి ఆధ్వర్యంలో వైయ స్ఆర్ బీమా తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.10, 000 మృతుడి కుటుంబ సభ్యులకు అందజే శారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ పి.రమేష్, వైయస్ఆర్ సిపి టౌన్ ప్రెసిడెంట్ చింతా విజ్జి, వెల్ఫేర్ సెక్రెటరీ పి.మద్దిలేటి, వాలంటీర్ సి.దీప్తీ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

కార్మికురాలకు దుస్తులను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-డోన్

పారిశుధ్య కార్మికులకు డోన్ మున్సిపల్ చైర్మెన్ సప్తశైల రాజేష్ దుస్తులు పంపిణీ చేశారు. గురువారం డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయం నందు ప్రజా ఆరోగ్యశాఖకు సంబంధించిన రెగ్యులర్ పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకొక్క పారిశుధ్య కార్మికుడికి 6 జతల ఖాకి యూనిఫామ్, 6 టవల్స్, కార్మికురాళ్లకు 6 చీరలు, 6 టవల్స్ చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,వైస్ చైర్మన్ లు కొట్రికే హరికిషన్, ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు వెంకట రాముడు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో గురువారం సన్మాన సభ ఏర్పాటు చేశారు.ఉత్తమ ఉపాధ్యా యుడి అవార్డు అందుకున్న వెంకటరాముడుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు శాస్త్రి,రవీంధ్రారెడ్డి,శివశంకర్, రాజ శేఖర్రెడ్డి మహబూబ్బాషా, వినయ్, హరిహ రనాథ్ రెడ్డి, నారాయణమూర్తి, పాల్గొన్నారు.

చురుకుగా ఈద్గా నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని లింగందిన్నే రోడ్డులో ఉన్న పాత ఈద్గా సమీపంలో నూతన ఈద్గా నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. దాదాపు మూడు కోట్ల రూపాయల అంచనా తో ఈద్గా నిర్మాణం చేపట్టనున్నారు.. గురువారం పనులను ముస్లిం మత పెద్దలు హాజీ సాదిక్ భాయ్, అమీర్ బాషా తదితరులు పనులను పరిశీలించారు. వచ్చే రంజాన్‌కు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి: సిఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని శిరివెళ్ళ సీఐ చంద్ర బాబు నాయుడు సూచించారు. సిరివెళ్లలోని పోలీస్ స్టేషన్ లో గురువారం ఎస్సై సురేష్ అధ్యక్షతన వినాయక చవితి వేడుకల సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, డిజెలు, రికార్డింగ్ డాన్స్ లు నిషేధమన్నారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ గాని మతకల్లోలం సృష్టించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం , పోలీస్ సిబ్బంది,తెలుగుదేశం, వైసిపి నాయకులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

పీర్ల పండగ సంతాప సభలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పీర్ల పండుగ 40 రోజుల అర్బయిన్ సందర్భంగా సంతాప సభలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. గురువారం పట్టణంలోని కొండపేట నుండి ఇమామ్ హాసన్,ఇమామ్ హుస్సేన్‌ల మొహరం 40 రోజుల అర్బయిన్ సందర్భంగా పాత సిండికేట్ వరకు పెద్ద ఎత్తున మాతం చేసుకొంటూ శోక తప్త హృదయాలతో వందలాది షియా మతస్థులు ఊరేగింపు నిర్వహించారు. ఇమామ్ హాసన్,ఇమామ్ హుస్సేన్ మొహరం ఆర్బయిన్ వేడుకల్లో షియా మతస్తులతో పాటు ఊరేగింపులో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొ ని పీర్లకు ప్రత్యేక పాతేహాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సహనానికి మారుపేరు అయినటువంటి మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఎవరెస్ట్ బాబు, ఆస్థానం సాబ్జాన్, చాంద్ భాషా, నవాబ్ జాన్, అమీర్ జాన్, షియా మతస్థులు పాల్గొన్నారు.

పీర్లకు ఫాతిహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

విత్తనాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల వారి కార్యాల యము నందు, గురువారం నాడు జిల్లా షెడ్యూల్డ్ కులముల ఆర్థిక సేవ సహకార సంస్థ ఆధ్వర్యంలో, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉచిత విత్తనాల కిట్లను శాసనసభ్యులు తొగురు ఆర్థర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయలక్ష్మి దేవి, జడ్పిటిసి కరీమున్నీసా, ఎంపీపీ మురళీకృష్ణ రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ శేఖర్, వైసిపి జిల్లా కార్యదర్శి డాక్టర్ వనజ, వైసిపి నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, మొల్ల జాకీర్ హుస్సేన్, జిల్లా వైసిపి కార్యవర్గ సభ్యులు తొగట నాగార్జున ప్రసాద్, షేక్ ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలే లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వర్తింప చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బాబుల్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో గ్రామ సర్పంచి యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు బాబు రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, తాగునీటి సమస్య వంటి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, గూని నాగరాజు, కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, ప్లాట్ల దస్తగిరి, చంద్రశేఖర్ అయ్యా, కృష్ణుడు,రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి

ఉపాధి కల్పించడంలో మోడీ విఫలం

- ప్రజా వ్యతిరేక విధానాలపై యువత గళమెత్తాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బేతంచెర్ల

దేశ జనాభాలో 35 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో మోడీ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి నిరంజన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ విమర్శించారు. గురువారం నాడు బేతంచెర్ల పట్టణంలో విద్యారంగం-నిరుద్యోగంపై ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మధు శేఖర్, శివ ఆధ్వర్య ంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ జనాభాలో నిరుద్యోగ యువత 65 శాతం మంది ఉన్నారని వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వారు అన్నారు. 2014లో ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్ర మోడీ హామీ ఇచ్చి గద్దెనెక్కి ఆచరణలో ఉద్యోగాలు కూడా కల్పించకపోగా కోటి 50 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయే స్థితి తెచ్చారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి కృషి చేయడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని ఎండగట్టాలని, అందుకోసం దేశంలోని విద్యార్థులు, యువకులు ఐక్యం కావాలని పోరాడి రావలసిన ఉద్యోగాలు సాధించుకోవాలని పేర్కొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలో విద్యరంగ నిరుద్యోగ సమస్యలపైన అవగాహన సదస్సును డివైఎఫ్ఐ డోన్ మండల కార్యదర్శి నక్కిహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు ఓ.లక్ష్మణ్, ఎం.మధుశేఖర్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏ.నిరంజన్,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శివ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జె.అశోక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాలు సాధించుకోవాలని, ప్రజలపై మోపుతున్న బారాలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు.

బేతంచెర్ల : మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

గాయపడిన కూలీలు

కూలీల ఆటో బోల్తా - స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలో వ్యవసాయ కూలీల ఆటో బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే పాములపాడు గ్రామ నివాసి శివ కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామం శివారుల్లోని వ్యవసాయ పను లు చేసేందుకు 9 మంది కూలీలను మాట్లాడుకొని ఆటోలో వస్తుండగా కొత్తమాడుగుల, ఎం. లింగాపురం గ్రామాల రహదారిలో క్రస్టర్ పాయింట్ వద్ద అటో అదుపు తప్పింది. దీంతో రొడ్డు ప్రక్కనే ఉన్న సైడు కాల్వలో ఆటోబోల్తాపడింది. స్థానికులు స్వల్ప గాయాలైన వారికి ప్రథమ చికిత్సను చేయించి, క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

మూడో దశ రీసర్వే ప్రక్రియపై పకడ్బందీ ప్రణాళిక

- జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో చేపట్టిన మూడవ రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సర్వేయర్లను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ మూడవ విడత రీ సర్వే ప్రక్రియపై మండల, సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి హరికృష్ణ, డిపిఒ మంజుల భార్గవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 150 గ్రామాలలో చేపట్టే మూడో విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా తొలుత 56 గ్రామాలను ఎంపిక చేసుకొని పూర్తి చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని మండల, సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో ఆలస్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా త్వరితగతినగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించి ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాలలో పెండింగ్ ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు

యూరియా ఎరువులు స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో విష్ణువర్ధన్ రెడ్డి

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో 60 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 71 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. డీలర్లు ఎవరైనా ఎరువులను ఎంఆర్పి ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, లేదా ఇతర ఎరువులను జత చేసి అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రతి డీలర్ షాప్ నందు మండల వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకుల వారి మొబైల్ నెంబర్లు ఉన్నాయని, ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, ఇతర ఎరువులను జత చేసి అమ్మినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సిసి రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి - పాములపాడు

మండలం జూటూరు గ్రామంలో సిసి రోడ్లను ఎంపీడీవో గోపికృష్ణ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడపగడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ సచివాలయానికి అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.20 లక్షలు మండలంలోని అన్ని సచివాలయాలకు ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా జూటూరు గ్రామంలో ఎస్సీ, బిసి, మసీదు రోడ్డు, సిసి రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ సావిత్రమ్మ, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, నాయకులు మద్దిలేటి, ఉపేంద్ర పాల్గొన్నారు.

పరిశీలించిన ఎంపీడీవో గోపికృష్ణ

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.19/2018

దిమ్మ శిలువమ్మ.
...వాది

వర్సెస్

1.తెలుగు వెంకట లచ్చుమ్మ
2. తెలుగు శేఖర్
3.తెలుగు నాగేశ్వరమ్మ D/O. లేట్ నాగరాజు భర్త ఆంజనేయులు పలుకూరు గ్రామం, బనగానపల్లె మండలం నంద్యాల జిల్లా.

...ప్రతివాదులు

3.వ ప్రతివాది కి సమన్లు

పై దావా నందు వాది ప్రతిపాది పై దావ దాఖలుచేసి ఉండి. బాండు బాపతి గాను అటాచ్మెంట్ అయి ఉండి డబ్బులు మొత్తం రాగోరి.మూడవ ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ. 18-9-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించ బడునని మీకు తెలియజేయడ మైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ.18-9-2023

ఇట్లు
కాకరవాడ పుల్లన్న,
వాదపరం అడ్వకేట్
నంద్యాల.